

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
5★★★
శుక్రవారం 26 జనవరి 2024



రాజన్న ఆలయ అభివృద్ధిపై త్వరలోనే సమీక్ష
- మంత్రి సీతక్క - 7లో..

రోడ్డు ప్రమాదాల నివారణకు
ముందస్తు చర్యలు చేపట్టాలి - 8లో..

ఉద్యమాలకు ఊపిరి



- స్వాతంత్ర్య పోరాటంలో సిరిసిల్ల కీలక భూమిక
- స్ఫూర్తినిచ్చిన ఆంధ్రా మహాసభ
- మానాల కేంద్రంగా గెరిల్లా శిబిరాలు
- సిరిసిల్లలో చేనేత కార్మిక మహాసభ

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

భారతదేశం గణతంత్ర రాజ్యంగా 1950 జనవరి 26న అవతరించింది. మన మేధావులు రాసిన రాజ్యాంగం అమల్లోకి వచ్చిన రోజున జరిగే వేడుకల్లో స్వాతంత్ర్య ఉద్యమం, నిజాం వ్యతిరేక పోరాటాలకు కీలక భూమికగా మారిన రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రజలు పోషించిన పాత్రను గుర్తు చేసుకుంటున్నారు. ఆంగ్లేయుల పాలన నుంచి రాజ్యాధికారాన్ని పొందిన భారతీయుల కళ్లలో కాంతులు విరజిమ్మిన క్షణాలే కాకుండా సెప్టెంబర్ 17 నిజాం సర్కార్, భారత్ సర్కార్‌లు విలీనం వరకు వందేమాతరం, సత్యాగ్రహం, సహాయ నిరాకరణ, విదేశీ వస్తువుల బహిష్కరణ, క్విట్ ఇండియా ఇలా అనేక ఉద్యమాల్లో సిరిసిల్ల ప్రజలు ముందు నిలిచారు. ముఖ్యంగా స్వాతంత్ర్య పోరాటాల్లో స్టేట్ కాంగ్రెస్ సత్యాగ్రహాలు, చేనేత కార్మిక మహాసభలు, సిరిసిల్ల పాత తాలూకాలోని మానాల అడవుల్లో గెరిల్లా శిబిరాలు, ఖాదీ ఉద్యమం, గ్రంథాలయోద్యమం, ఆంధ్ర మహాసభ, ఆంధ్ర మహిళా మహాసభలు నిర్వహిస్తూ ప్రజలు కదం తొక్కారు.

గ్రంథాలయోద్యమం

నిజాం నిరంకుశ పాలన కింద బతుకులీడుస్తున్న ప్రజలను పోరాట బాటలో నడిపించడానికి గ్రంథాలయోద్యమం కూడా ముఖ్యమైంది. 1886లో మందిన ఆదినారాయణ అనే ఉపాధ్యాయుడు విశాఖపట్నంలో మొదట గ్రంథాలయాన్ని స్థాపించాడు. ఆ క్రమంలోనే గ్రంథాలయాలు స్థాపనకు నాంది పలికాయి. ప్రథమంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 1922లో బస్వేశ్వర్‌రావు, వెంకట్రామారావులు, శ్రీవిశేశ్వర భాషా నిలయం పేరిట గ్రంథాలయ ఉద్యమానికి నాంది పలికారు. దామెర్ల నరహరి లైబ్రేరియన్‌గా చాలా కాలం పని చేశారు. 1925లో సిరిసిల్లలో శ్రీ నారా యాంధ్ర భాషా నిలయం స్థాపించారు.

ఖాదీ ఉద్యమం

గ్రామ స్వరాజ్య స్థాపన కోసం చెరక గ్రామ పరిశ్రల పునరుద్ధరణ కోసం మహాత్మాగాంధీ పిలుపునిచ్చారు. ఆ ఉద్యమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సిరిసిల్ల, మెట్‌పల్లి ముఖ్యభూమిక పోషించాయి. సిరిసిల్లలో చేనేత మగ్గాలు ఊపందుకున్నాయి. 1946లో నిజాం నిరంకుశ వ్యతిరేక పోరాటం ఉధృతంగా సాగింది. ఖాదీ కార్యకర్తలపై నిర్బంధం విధించారు. ఉద్యమకారులు చెరఖ సంఘాల్లో తల దాచుకునే వారు. నిజాంకు వ్యతిరేకంగా స్వాతంత్ర్యం సాధించిన తరువాత సాయుధ పోరాటం ఉధృతంగా సాగిన క్రమంలోనాడు సిరిసిల్ల పాత తాలూక ప్రస్తుతం రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఉన్న మానాల అడవి గెరిల్లా శిక్షణ శిబిరాలకు కేంద్రంగా మారింది. సిరిసిల్ల, రుద్రంగి, కామారెడ్డి, ఆర్మూర్, ప్రాంతాలకు చెందిన కార్యకర్తలు మానాలలో శిక్షణ పొందేవారు. మానాల గ్రామ భూస్వామి రాజిరెడ్డి శిక్షణ శిబిరాలకు ఎంతో సహకరించేవాడు.

వందేమాతరం

స్వాతంత్ర్య పోరాటం కోసం ప్రజలు ఆలపించడానికి జాతీయ గీతంగా వందేమాతరం ఉండేది. 1938లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ముస్లిం విద్యార్థుల ఫిర్యాదు మేరకు నిజాం ప్రభుత్వం వందేమాతర గీతాన్ని నిషేధించింది. వందేమాతర ఉద్యమం ఔరంగబాద్‌లో ప్రారంభమైంది. వందేమాతరం గీతాలా పనతో ఉమ్మడి కరీంనగర్ జిల్లా విద్యార్థుల్లో దేశభక్తి మొదలైంది. పోరాటంలో విద్యార్థులు చేరడం ప్రారంభమైంది. అదే స్ఫూర్తి తో క్విట్ ఇండియా ఉద్యమాన్ని రాజన్న సిరిసిల్ల జిల్లా హన్మాజిపేటకు చెందిన జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డాక్టర్ సి నారాయణరెడ్డి నడిపించారు.

సిరిసిల్లలో చేనేత కార్మిక సభ

ఆంధ్ర మహాసభ స్ఫూర్తితో సిరిసిల్ల నేత కార్మికులు కూడా ముందుకు సాగారు. కార్మికుల సమస్యలను పరిష్కరించడం కోసం చేనేత కార్మిక సం ఘం ఏర్పడింది. కార్మిక సంఘం తెలంగాణ తృతీయ మహాసభను సిరిసిల్లలో జరుపుకున్నారు. డాక్టర్ గాజుల భూపతి, పత్తిపాక విశ్వనాథం ఆహ్వాన సంఘంగా ఏర్పడి 1946లో సభ నిర్వహించారు. సభలో నిజాం నవాబ్ వైద్యుడిగా ఉన్న నారాయణదాస్‌ను ఎన్నుకున్నారు. ప్రతినిధులు ఇష్టపడలేదు. సంస్థానం బయట నుంచి వచ్చిన వారిలో ఒకరిని ఎన్నుకోవాలని పట్టుబట్టారు. ఆహ్వాన సంఘం ప్రతినిధి న్యాయవాది కొడిమ్యాల భూమ య్య మాటలను ఎవరూ వినకపోవడంతో కామారెడ్డిలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న అమృతలాల్ శుక్లాను పిలిపించారు. సంస్థానంలో ఉన్నవాడైన ఉద్యమరీత్యా కొండ లక్ష్మణ్‌ను ఎన్నుకోవాలని సూచించారు. దానికి అందరు అంగీకరించారు. మహాసభ తర్వాత అమృతలాల్ శుక్లాను ఉద్యోగం నుంచి తొలగించే ప్రయత్నం చేశారు. దీంతో శుక్లా స్వచ్ఛందగా ఉద్యోగానికి రాజీనామా చేసి పోరాటా న్ని ముందుకు నడిపించారు.

జాతీయ జెండాలతో నేతన్నలకు ఉపాధి

జాతీయ జెండాల తయారీతో సిరిసిల్ల నేతన్నకు ఉపాధి లభిస్తోంది. స్వాతంత్ర్య సంబరాలు, భారత వజ్రోత్సవాలు ఇలా పలు కార్యక్రమాలకు సిరిసిల్లలో ఉత్పత్తి అయిన బట్టను ఉపయోగించి జాతీయ జెండాలను తయారు చేస్తున్నారు. హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాల్లో సిరిసిల్ల నేతన్నల జెండాలే రెపరెపలాడాయి. లక్షలాది జెండాలు సిరిసిల్లలో తయారు చేయడం ద్వారా నేత కుటుంబాల్లోని మహిళలకు ప్రతీరోజు రూ.500 వరకు వేతనాలు లభించాయి. భారత వజ్రోత్సవాల్లో భాగంగా 75 లక్షల జెండాలను సిరిసిల్లలోనే తయారు చేయడం గమనార్హం.

సిరిసిల్లలో ఆంధ్ర మహాసభ

ఉద్యమాలకు సిరిసిల్లలో జరిగిన ఆంధ్ర మహాసభ ఉమ్మడి జిల్లాకు స్ఫూర్తి నిచ్చింది. హైదరాబాద్‌లో ఒక సమావేశంలో మరాఠీ, ఇంగ్లీష్ భాషల్లో నాయకులు ఉపన్యాసాలు చేశారు. ఒకరు తెలుగులో మాట్లాడగా అందరూ నవ్వుకున్నారు. తెలుగు భాషకు, తనకు జరిగిన అవమానాన్ని భరించలేక వెంటనే మాడపాటి హన్మంతరావును కలిసి తెలుగు వారందరూ ఒక వేదికగా ఏర్పడాలని పేర్కొన్నారు. 1922లో ఆంధ్రజన కేంద్ర సంఘం ఏర్పాటు చేశారు.

నిజాం సంస్థానంలో భాషా సంస్కృతులు అణచివేస్తున్న కాలంలో ఆంధ్రజన కేంద్ర సంఘం 1928లో ఆంధ్రా మహాసభగా రూపు దాల్చింది. 1930లో సురవరం ప్రతాపరెడ్డి అధ్యక్షతన మెదక్ జిల్లా జోగిపేటలో మొదటి ఆంధ్రమహాసభ చారిత్రక పోరుకు బీజం వేసింది. రెండో మహాసభ 1931లో డిసెంబరులో బూరుగుల రామకృష్ణారావు అధ్యక్షతన దేవరకొండలో, 1934లో పులిజాల రంగారావు అధ్యక్షతన ఖమ్మంలో మూడో మహాసభ జరిగాయి. ఆ క్రమంలో నాలుగో ఆంధ్రమహాసభ 1935లో సిరిసిల్లలో భీమకవి నగరంగా మాడపాటి హన్మంతరావు అధ్యక్షతన సభ జరిగింది. ఈ సభలో తెలంగాణ యోధులు బద్దంయెల్లారెడ్డి, రామకృష్ణరావు, కేవీ రంగారెడ్డి, జేవీ నర్సింగారావు, సురవరం ప్రతాపరెడ్డి, రావినారాయణరెడ్డివంటి నాయకులు పాల్గొన్నారు. మహాసభ నిర్వహణలో సిరిసిల్ల తాలూకలోని గాలిపెల్లికి చెందిన బద్దం ఎల్లారెడ్డి ముఖ్య భూమికను పోషించారు. మహాత్మా గాంధీ పిలుపు మేరకు బద్దం ఎల్లారెడ్డి ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని జైలుకు వెళ్లారు. అనంతరం జరిగిన ఈ మహాసభకు ఆహ్వాన సం ఘాన్ని ఏర్పాటు చేశారు. దానికి ఆవునూర్ వేణు గోపాల్‌రావు అధ్యక్షునిగా, కార్యదర్శిగా కొడిమ్యాల భూమయ్య, సంయుక్త కార్యదర్శులుగా బద్దం ఎల్లారెడ్డి, పి నర్సింగరావు వ్యవహరించారు.

వేములవాడ భీమ కవి నగరంగా నిర్వహించిన మహాసభకు వివిధ ప్రాంతాలనుంచి ఎంతో మంది పాల్గొన్నారు. ఇదే ప్రాంగణంలో 4వ ఆంధ్రా మహిళ సభ కూడా నిర్వహించారు. దీనికి మాడపాటి హన్మంతరావు సతీమణి మాణిక్యమ్మ అధ్యక్షత వహించారు. ఈ మహాసభల స్ఫూర్తితో జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలు కొత్త మలుపు తిరిగాయి. శిస్తు మాఫీ చేయాలని, నిర్బంధం లేవి ధాన్యం వసూలు చేయావద్దని, బరాయింద ఉద్యమం నడిచింది.



గణతంత్ర వేడుకలకు సర్వం సిద్ధం



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

సిరిసిల్ల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర వేడుకలకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం వద్ద ఏర్పాట్లను గురువారం అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ పరిశీలించారు. శుక్రవారం నిర్వహించే వేడుకలకు అంతరాయం కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ అనురాగ్ జయంతి ఉదయం 9 గంటల నుంచి 9 గంటల 05 నిముషాల వరకు పతాకవిష్కరణ 9.05 నుంచి 9.10 నిమిషాల వరకు గౌరవ వందన స్వీకరణ, 9.10 నుంచి 9.20 వరకు కలెక్టర్ సందేశం, 9.20 నుంచి 9.45 వరకు ప్రశంస పత్రాల ప్రదానం వంటి కార్యక్రమాలు చేపట్టనున్నారు.

సాంస్కృతిక ప్రదర్శనలు, మిల్లెట్ ఫుడ్ ఫెస్టివల్

గణతంత్ర వేడుకల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని కొత్త చెరువు బండ్ పార్కులో శుక్రవారం సాయంత్రం 4.30 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలను జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసింది. విద్యార్థులు దేశభక్తి, జాతీయ సమైక్యతను చాటుతూ సాంస్కృతిక ప్రదర్శనలు ఇవ్వనున్నారు. దీంతోపాటు చిరుధాన్యాలతో ఫుడ్ ఫెస్టివల్‌ను నిర్వహించనున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలను విజయ వంతం చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి కోరారు.

కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం

సిరిసిల్ల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ కాంగ్రెస్ బూత్ లీడర్స్ కన్వెన్షన్‌కు జిల్లా నుంచి కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు ఎంతో ఉత్సాహంగా తరలిలి వెళ్లారు. గురువారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో జరిగే బూత్ లీడర్స్ సమావేశానికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే హాజరైన నేపథ్యంలో సమావేశాలను విజయ వంతం చేయడానికి జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు.

ప్రెసిడెంట్ పోలీస్ మెడల్‌కు అడిషనల్ ఎస్పీ చంద్రయ్య



సిరిసిల్ల క్రైం, జనవరి 25: ప్రెసిడెంట్ పోలీస్ మెడల్ ఫర్ మెరిటోరియస్ సర్వీస్‌కి అదనపు ఎస్పీ చంద్రయ్య ఎంపికయ్యారు. గణతంత్ర వేడుకల సందర్భంగా జిల్లాలో అదనపు ఎస్పీగా విధులు నిర్వహిస్తున్న డి.చంద్రయ్యను ప్రెసిడెంట్ పోలీస్ మెడల్ ఫర్ మెరిటోరియస్ సర్వీస్‌కు ఎంపిక చేసినట్లు గురువారం భారత ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది అభినందనలు తెలిపారు. అదనపు ఎస్పీ చంద్రయ్య 1991లో ఎస్సైగా విధుల్లో చేరారు. ఆ తర్వాత వరంగల్ జిల్లాలో ఎస్సైగా పలు ప్రాంతాల్లో పని చేశారు. 2007లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొంది వరంగల్, ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాల్లో విధులు నిర్వహించారు. ఆ తర్వాత 2017లో డీఎస్పీగా పదోన్నతి పొంది రామగుండం, హన్మకొండ, సైబరాబాద్‌లో పని చేశారు. 2021లో అదనపు ఎస్పీగా పదోన్నతి పొందిన చంద్రయ్య రాజన్న సిరిసిల్ల జిల్లాలో బాధ్యతలు చేపట్టి నేటికి మూడేళ్లు పూర్తయ్యాయి. 34 సంవత్సరాలుగా పోలీస్‌శాఖలో ఉత్తమ సేవలు అందించినందుకు గతంలో పోలీస్‌సేవా పథకం, ఉత్తమ సేవా పథకాలు లభించాయి. ఈ సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం గణతంత్ర వేడుకల సందర్భంగా ప్రెసిడెంట్ పోలీస్ మెడల్‌కి ఎంపిక చేసింది.

క్రీడలతో మానసికోల్లాసం



పరిశీలిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): నిరంతరం విధి నిర్వహణలో ఉండే అధికారులకు క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారుల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీలను ప్రారంభించారు. జోర్స్ అధ్యక్షుడు డీటీవో కొండల్‌రావును అభినందిస్తూ ప్రతీ మూడు, ఆరు నెలలకు ఒకసారి అధికారులకు క్రీడలు నిర్వహించేలా చూడాలన్నారు. మరోసారి జరిగే క్రీడల్లో కుటుంబసభ్యులు పాల్గొనే విధంగా ఏర్పాట్లు చేద్దామన్నారు. క్రీడల్లో జిల్లా అధికారులందరూ భాగస్వాములు కావాలన్నారు. క్యారం, చెస్ పోటీల తీరును కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్లు పూజారి గౌతమి, ఖీమ్యానాయక్ ఆసక్తిగా తిలకించారు.

బీసీ, ఎస్సీ ఎమ్మెల్యేలంటే చులకన ఎందుకు

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- కేటీఆర్ వ్యాఖ్యలపై ఆగ్రహం



విలేకరులతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, జనవరి 25 : బీసీ ఎస్సీ ఎమ్మెల్యేలు అంటే మాజీ మంత్రి కేటీఆర్‌కు చులకన ఎందుకని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్ ప్రశ్నించారు. గురువారం ఉదయం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని సూచించారు. కరీంనగర్‌లో జరిగిన సమావేశంలో కేటీఆర్ బీసీ, ఎస్సీ ఎమ్మెల్యేలపై అసహనంతో మాట్లాడారని, బీసీలు, దళితులు ఎమ్మెల్యేలుగా ఉండకూడదా? మీ దొరలు మాత్రమే ఎమ్మె ల్యేలుగా ఉండాలా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేల భరతం పడుతానని కేటీఆర్ అన్న మాటలకు అర్థం ఏమిటని, కేటీఆర్ దళిత, బీసీల వ్యతిరేకని, కేటీఆర్‌కు ఇంకా దొర అహంకారం పోలేదని అన్నారు. నలుగురు కాంగ్రెస్ ఎమ్మె ల్యేలపై మాట్లాడిన మాటలను కేటీఆర్ ఉపసంహరించు కోవాలని, బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకుంటే కేటీఆర్‌కు గట్టిగా బుద్ధి చెబుతామని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్రాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పుల కుప్పగా మార్చిందన్నారు. పులి వస్తున్నదని కేటీఆర్ తరచూ అంటున్నాడని, పులి జనాల్లోకి వస్తే కచ్చితంగా బోన్‌లో వేస్తామని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఈ విషయాన్ని ఇప్పటికే స్పష్టం చేశారన్నారు. అసెంబ్లీలో జ్యోతిబాపూలే విగ్రహం ఏర్పాటు చేయాలనే విషయం ఎమ్మెల్సీ కవితకు అధికారంలో ఉన్న పదేళ్లలో గుర్తుకు రాకపోవడం విచిత్రమన్నారు. లిక్కర్ స్కాంలో ఈడీ నోటీసులు ఇస్తే మహిళల రిజర్వేషన్ గుర్తుకు వచ్చిందన్నారు. కవిత చెప్పక ముందు బతుకమ్మ పండుగ ఎవరూ జరుపుకోనట్లుగా వ్యవహరించిన తీరును ప్రజలు గమనించారని అందుకే వారిని పక్కన పెట్టారని అన్నారు.

విద్యార్థులు యువ పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి

వేములవాడ టౌన్, జనవరి 25 : విద్యార్థులు వినూత్న ఆలోచనలను ఆవిష్కరించి యువ పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని, దేశ ఆర్థిక అభివృద్ధిలో ప్రముఖ పాత్ర పోషించాలని ఎస్ఆర్ఆర్ కళాశాల అటనామస్ వైస్ ప్రిన్సిపాల్ రాజయ్య అన్నారు. వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ సెల్, కామర్స్ విభాగం సంయుక్తంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. వికసిత్ భారత్‌లో భాగంగా యువత వినూత్న ఆలోచనలను ప్రభుత్వానికి అందించాలని, 2047 వరకు భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా మార్చు చేయడానికి విద్యార్థులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వడ్లూరి శ్రీనివాస్, అకాడమిక్ సమన్వయకర్త మధు రాజేష్ తదితరులు ఉన్నారు.

టీఎస్ ఐపాస్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

సిరిసిల్ల కలెక్టరేట్, జనవరి 25 : టీఎస్ ఐపాస్ కింద వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం డీఐపీసీ, డీఎల్‌సీల సమావేశాన్ని నిర్వహించారు. మొత్తం 54 మంది లబ్ధిదారులకు రూ.కోటి 74లక్షల 66వేల 146 సబ్సిడీని ఆమోదించినట్లు సంబంధిత అధికారులు వివరించారు. సమావేశంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ గణేష్‌రాం తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి - జిల్లా కేంద్రంలో జాతీయ ఓటరు దినోత్సవం



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఆరోగ్యకర ప్రజాస్వామ్య నిర్మాణంలో భాగస్వాములు కావాలని కలెక్టర్ అనురాగ్ జయంతి కోరారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తా నుంచి ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో కలిసి ఓటరు దినోత్సవానికి సంబంధించి ప్రతిజ్ఞ చేయించారు. సీనియర్ ఓటర్లను అదనపు కలెక్టర్ పూజారి గౌతమి సన్మానించారు. యువ ఓటర్లకు గుర్తింపు కార్డులను అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ అర్హులందరూ ఓటు హక్కు పొందాలన్నారు. అసెంబ్లీ ఎన్నికలను విజయవంతంగా పూర్తి చేసినందుకు అధికారులను అభినందించారు. ఎన్నికల ప్రక్రియ నిరంతరం ఉం టుందని, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు నిరంతరం ప్రజలతో మమేకం కావాలన్నారు. యువత ఓటు హక్కు నమోదు చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, ఆర్డీవో ఆనంద్ కుమార్, డిప్యూటీ కలెక్టర్ గంగయ్య, జిల్లా స్థాయి అధికారులు సూర్యప్రకాష్, కొండల్‌రావు, రమేష్, వినోద్, ప్రసాద్, బుద్ధనాయుడు, భాస్కర్, దశరథం, శ్రీనివాసచారి, అన్సారీ, మున్సిపల్ కమిషనర్ అయాజ్ పాల్గొన్నారు.



సన్మానిస్తున్న అదనపు కలెక్టర్ పూజారి గౌతమి



ఎలిగేడు వాసికి పురస్కారం

ఎలిగేడు, జనవరి 25: మండల కేంద్రానికి చెందిన చెల్లోజ శ్రీనివాస్‌బాబు జాతీయ స్థాయి నంది అవార్డుకు ఎంపికయ్యాడు. యువ చైతన్య వెల్ఫేర్ సొసైటీ, విశ్వకర్మ సేవా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో స్వామి వివేకానంద, సుభాష్‌చంద్రబోస్ జయంతి ఉత్సవాల సందర్భంగా ఆర్టిస్ట్ చెల్లోజ శ్రీనివాస్‌బాబు చిత్రకళ రంగంలో విశిష్టమైన కృషి చేసినందుకు గాను తెలుగు వెలుగు నుంచి జాతీయ పురస్కార నిర్వహణ కమిటీ చైర్మన్ బ్రహ్మశ్రీ డాక్టర్ వెలబోజు మోహన్‌రావు, కోఆర్డినేటర్ పోలోజు రాజ్‌కుమార్ చార్యులు జాతీయ పురస్కారం అందుకోనున్నట్లు చెల్లోజ తెలిపారు. అందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

హుజూరాబాద్ జిల్లా సదస్సు కరపత్రాల ఆవిష్కరణ

హుజూరాబాద్, జనవరి 25: హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో పీవీ పేరుతో హుజూరాబాద్‌ను జిల్లాగా ఏర్పాటు చేయాలని కోరుతూ గురువారం జిల్లా జేఏసీ నాయకులు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఈ నెల 28న హుజూరాబాద్‌లోని సిటీ సెంట్రల్ హాల్‌లో పీవీ జిల్లా కోసం జిల్లా సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సదస్సుకు 13 మండలాలకు చెందిన అన్ని పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, కవులు, కళాకారులు, మేధా వులు, అంబేద్కర్ వాదులు, యువకులు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో సదానందం, వెంకటరాజం, రవీందర్‌రెడ్డి, రత్నం, ఈశ్వర్‌రెడ్డి, రాజన్న, శేఖర్, జగన్నాథం, ముక్కెర రాజు, హరిహరన్, అయిలయ్య, అశోక్, వంశీకృష్ణ, ప్రభాకర్, హరికృష్ణగౌడ్, లింగమూర్తి, మల్లయ్య, రాజు, శ్రీనివాస్, స్రవంతి, భానుచందర్, అశోక్, వెంకటరెడ్డి, ప్రభాకర్, సతీష్, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

రెండు రోజుల్లో నారాయణపూర్‌కు ఎల్లంపల్లి నీరు


- ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం


గంగాధర, జనవరి 25: రెండు రోజుల్లో నారాయణపూర్ రిజర్వాయర్‌కు ఎల్లంపల్లి నీరును పంపిణీ చేసి పంటలను కాపాడుతామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. నందిమేడారం పంపు హౌస్ పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పంపు హౌస్ పనులు త్వరగా పూర్తి చేసి ఎల్లంపల్లి నీరు విడుదల చేయాలని నీటి పారుదల శాఖ ఈఎన్‌సీతో మాట్లాడినట్లు ఆయన తెలిపారు. నారాయణపూర్ రిజర్వాయర్ ఆయకట్టు చివరి మడి వరకు సాగునీరందిస్తామని తెలిపారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట చొప్పదండి మున్సిపాల్ చైరపర్సన్ గుర్రం నీరజ భూం రెడ్డి, గంగాధర జడ్పీటీసీ పుల్కం అనురాధ నర్సయ్య, చొప్పదండి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఇప్ప శ్రీని వాస్‌రెడ్డి, నాయకులు బండపల్లి యాదగిరి, మునిగాల చందు తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

రాయికల్, జనవరి 25: ఉమ్మడి జిల్లా పరిధిలో వేర్వే రు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. రాయికల్ మండల లోని ఇటిక్యాల గ్రామానికి చెందిన అంకతి శ్రీనివాస్ (36) బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించాడు. బుధవారం రాత్రి ద్విచక్రవాహనంపై తన స్నేహితుడు దువ్వాక నాగరాజును కూర్చోబెట్టుకుని ఒడ్డెలింగాపూర్‌కు వెళ్లి వస్తుండగా భూపతిపూర్ గ్రామ శివారులో మూల మలుపు వద్ద అదుపు తప్పి రోడ్డు పక్కన గల ఇనుప రెయిలింగ్‌కు ఢీకొట్టాడు. దీంతో శ్రీనివాస్ తలకు బలమైన గాయం కావడంతో ఆస్పత్రికి తరలించే క్రమంలో మరణించాడు. నాగరాజుకు స్వల్ప గాయాలయ్యాయి. శ్రీనివాస్ తండ్రి లింగయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అజయ్ తెలిపారు.

గంగాధర: గంగాధర మండలం లక్ష్మీదేవిపల్లిలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై పుల్ల అభిలాష్ తెలిపారు. లక్ష్మీదేవిపల్లికి చెందిన దాసరి మల్లయ్య(60), అదేగ్రామానికి చెందిన లింగయ్య గురువారం గంగాధరకు పనినిమిత్తం బైక్‌పై వెళ్లారు. సాయంత్రం ఇంటికి ద్విచక్రవాహనంపై తిరిగి వస్తుండగా లక్ష్మీదేవిపల్లి శివారులో రోడ్డుపక్కన ఆగి ఉన్న వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో వాహనం నడుపుతున్న మల్లయ్య తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. వెనకాల కూర్చున్న లింగయ్యకు కాళ్లు విరిగాయి. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.















ఢిల్లీ రిపబ్లిక్ డే పరేడ్‌లో ఖని ఎన్‌సీసీ కెడెట్లు



కెడెట్లు రిజియాన్, హైమ

కోల్‌సిటీటౌన్, జనవరి 25: ఢిల్లీలో శుక్రవారం జరిగే 75వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో గోదావరిఖని సెక్రెడ్ హార్ట్ హైస్కూల్‌కు చెందిన ఇద్దరు ఎన్‌సీసీ కెడెట్లు రిజియాన్, బొజ్జ హైమ పాల్గొనేందుకు ఎంపికయ్యారు. ఆర్మీ వింగ్ తరుపున రిజియాన్, హేర్ వింగ్ తరుపున బొజ్జ హైమలు తెలంగాణ, ఏపీ డైరెక్టరేట్ నుంచి పాల్గొంటున్నారు. కాగా దేశ ప్రధాని నరేంద్రమోదీకి గౌరవ వందనం చేయనున్నారు. కాగా పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే పరేడ్‌కు పాల్గొనడం జిల్లాకు, పాఠశాలకు ఎంతో గర్వకారణమని పాఠశాల కరస్పాండెంట్ లవ్‌లీజాకబ్, ప్రిన్సిపల్ జ్యోత్స్న, ఎన్‌సీసీ ఆఫీసర్ జ్యోత్స్న, ప్రైమరీ ఇన్‌ఛార్జి ఇన్నమ్మ, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆదివరహాస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే గంగుల



కుటుంబీకులతో కలిసి మొక్కులు చెల్లించుకుంటున్న గంగుల

కమాన్‌పూర్, జనవరి 25: మండల కేంద్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఆదివరహా స్వామిని గురువారం కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షులు పిన్‌రెడ్డి కిషన్‌రెడ్డి, సర్పంచ్ నీలం సరిత,దేవస్థాన డైరెక్టర్ దండే కనకరత్నం, యూత్ అధ్యక్షులు బొమ్మగాని అనిల్‌గౌడ్ ఉన్నారు.

ఆయిల్ పామ్ తోటలను సందర్శించిన జగిత్యాల రైతులు

అశ్వారావుపేట, జనవరి 25: జగిత్యాలకు చెందిన సుమారు 150 మంది పామాయిల్ రైతులు గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట, దమ్మపేటలో మండలాలలో పలు పామాయిల్ క్షేత్రాలను సందర్శించారు. పామాయిల్ రైతులు విజ్ఞాన విహారయాత్రలో భాగంగా పామాయిల్ నర్సరీల పెంపకం, క్షేత్రాలు, సాగు విధానం, నీటి యాజమాన్యం, ఎరువుల యాజమాన్యంపై అవగాహనకోసం అశ్వారావుపేటలోని పామాయిల్ నర్సరీని సందర్శించారు. అనంతరం నారంవారిగూడెంలోని పామాయిల్ తోటలను రైతులు అశ్వారావుపేట ఆయిల్‌ఫెడ్ అధికారులు చూపించారు. అనంతరం దమ్మపేట మండలంలోని అప్పారావుపేట ఫ్యాక్టరీని చూపించి, ఉత్పత్తి అయిన పామాయిల్ గెలల క్రషింగ్ విధానంపై రైతులకు వివరించారు.

కొండగట్టులో ఆగని అదనపు వసూళ్లు

● ఇబ్బందులు పడుతున్న భక్తులు ● పట్టించుకోని ఆలయ అధికారులు

మల్యాల, జనవరి 25: కొండగట్టు ఆంజనేయస్వామి దర్శనానికి వచ్చే భక్తులు దేవస్థానం పరిధిలో అడుగడుగునా దోపిడీకి గురవుతున్నారు. కొండ ఎక్కింది మొదలు దిగే వరకు నిలువు దోపిడీ భారిన పడుతున్నారు. ఏళ్లుగా ఇదే తంతు సాగుతున్నా దేవాదాయ శాఖ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని హిందూ ధార్మిక సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. కొండపైన గుట్కాల విక్రయం, అధిక ధరల దోపిడీతో భక్తుల మనోభావాల్ని దెబ్బతీస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. కొండగట్టు అంజన్న సన్నిధిలో కొబ్బరికాయ నుంచి అన్ని వస్తువులను కొనాలంటేనే భక్తులు జంకుతున్నారు. మార్కెట్ ధరలకు అదనంగా 10శాతం హెచ్చు ధరలతో కొండపైన వస్తువులు విక్రయించాలని పేర్కొంటున్నప్పటికీ ఇక్కడ అధిక ధరలకు అమ్ముతున్నారని కొందరు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. కొండపైన గల అన్ని దుకాణాల్లో దోపిడీ జరుగుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. లాకర్ రూం, కిరాణం, కూల్‌డ్రింక్స్ హోటల్, ఫొటోస్టూడియో, బొమ్మలు, పూలు, పండ్లు అమ్మకం వద్ద కూడా భక్తులు దోపిడీకి గురవుతున్నారని పలువురు పేర్కొంటున్నారు. చివరకు చెప్పులు భద్రపరచడం చోట, మరుగుదొడ్ల వద్ద కూడా అధికంగా వసూలు చేస్తున్నారు. వాహన పూజలకు టికెట్టు తీసుకున్నప్పటికీ భక్తుల వద్ద వాహనాన్ని బట్టి అర్చకులు, అక్కడి సిబ్బంది వందల్లో వాహనాదారుల వద్ద వసూలు చేస్తారనేది బహిరంగ ముచ్చట.. కానీ పట్టించుకునే వారుండరు. తలనీలాలు సమర్పించే చోట క్షురకులు ఒక్కో భక్తుడి వద్ద రూ.50కి పైగా, కొబ్బరియకాయలు కొట్టే చోట రూ.5 నుంచి 10 వసూలు చేస్తున్నా అధికారులు చోద్యం చూస్తారే తప్ప చర్యలు తీసుకోరని పలువురు ఆరోపిస్తున్నారు.

● కానరాని ధరల సూచిక బోర్డులు

ఆలయ పాలక మండలి ఏడాదిన్నర క్రితం దుకాణాల వద్ద ధరల సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని తీర్మానం చేశారు. ఇంత వరకు వాటి ఊసే లేకుండా పోయింది. ప్రతి దుకాణం ముందు ధరల సూచిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు వాటిని నిత్యం పర్యవేక్షణ చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఇటీవల వీహెచ్‌పీ నాయకులు కొబ్బరికాయ కొట్టే వద్ద వసూళ్లు, అధిక ధరలకు వస్తువుల విక్రయంపై ఆందోళన వ్యక్తం చేశారు. చర్యలు తీసుకోవాలంటూ ఈవోకు వినతిపత్రం అందజేశారు. అయినా పట్టించుకునే వారు కరువయ్యారు. కొండపైన దుకాణాలు ఒక్కొక్కటి మాత్రమే ఉండడం



కొండగట్టు ఈవోకు వినతిపత్రం ఇస్తున్న వీహెచ్‌పీ నాయకులు

తో వ్యాపారులు ఇష్టారీతిన వ్యవహరిస్తూ భక్తులను దోచుకుంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న దుకాణాలను ఒక్కో దాన్ని రెండు నుంచి మూడుకు పెంచాల్సి ఉంది.

బోర్డులు ఏర్పాటు చేయాలి

యాగండ్ల లక్ష్మీనారాయణగౌడ్, వీహెచ్‌పీ అధ్యక్షుడు



కొండగట్టులో వ్యాపారుల దోపిడీ అరికట్టడానికి ఆయా దుకాణాల వద్ద బోర్డులు ఏర్పాటు చేయాలి. ధరల సూచికలతో భక్తులు దోపిడీకి గురికాకుండా చూడవచ్చు. కొందరు అధికారుల నిర్లక్ష్యంతోనే వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోకపోతే మేమే బోర్డులు ఏర్పాటు చేస్తాం.

చర్యలు తీసుకుంటాం - పి.వెంకటేశ్, ఈవో



కొండపైన వ్యాపారులు అధిక ధరలకు విక్రయిస్తే తగు చర్యలు తీసుకుంటాం. దేవస్థానం నిబంధనల మేరకే వస్తువులు విక్రయించాల్సి ఉంటుంది. వ్యాపారులు, అర్చకుల నుంచి భక్తులకు ఇబ్బంది కలిగితే ఫిర్యాదు చేయాలి. వ్యాపార సంస్థలు, దుకాణాల ముందు ధరల సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తాం.

అంబేద్కర్ డిగ్రీ ప్రవేశానికి ఈ నెల 31 వరకు గడువు పొడిగింపు

గణేశ్‌నగర్, జనవరి 25: డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం 2024-25 విద్యా సంవత్సరానికి డిగ్రీ మొదటి సంవత్సరం అడ్మిషన్లకు గడువు ఈనెల 31 వరకు పొడిగించినట్లు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.టి.లక్ష్మీ, కోఆర్డినేటర్ డా.ప్రశాంత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ ఓపెన్ స్కూల్, ఐటిఐ, డిప్లొమా విద్యార్థులు, ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని రశీదు పొందాలని పేర్కొన్నారు. ఇతర సమాచారం కోసం 73829297755 ఫోన్ నంబర్‌కి కాల్ చేసి సంప్రదించాలని కోరారు.

ఎస్‌యూలో ఈ నెలతో ముగియనున్న రిటైర్డ్ అధ్యాపకుల సేవలు

గణేష్‌నగర్, జనవరి 25: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల మేరకు రిటైర్డ్ ప్రొఫెసర్ల సేవలు జనవరి 31తో ముగియనున్నట్లు శాతవాహన విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ సంకశాల మల్లేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాతవాహన యూనివర్సిటీకి 12బి గుర్తింపులో న్యాక్ సాధించేందుకు కమిటీలో భాగస్వాములైన వివిధ విభాగాల రిటైర్డ్ అధ్యాపకులు భరత్, సాయిలు, పురుషోత్తం, వడ్నాల రమేష్, లక్ష్మణ్ సేవలు అభినందనీయమని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెలతో సేవలు ముగియనున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

మానకొండూర్, జనవరి 25 : మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన ఏనుగుల నాగరాజు (46) అనే వ్యక్తి పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. అన్నారం చెందిన నాగరాజు బుధవారం రాత్రి పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండగా హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడికి భార్య రాజేశ్వరి, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

గోదావరిలో రెండు మృతదేహాలు లభ్యం

ఫైటింక్లయిన్‌కాలనీ, జనవరి 25: గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గోదావరి నదిలో గురువారం రెండు మృతదేహాలు లభ్యమయ్యాయి. ఇద్దరు వ్యక్తులు ఆత్మహత్య చేసుకునేందుకు నదిలో దూకగా మృతదేహాలు గురువారం తెల్లవారు జామున ఒడ్డుకు కొట్టుకువచ్చాయి. ఈమృతదేహాలు గోదావరిఖనికి చెందిన అజీమొద్దీన్(29), కొయ్యడ రాకేష్(33)గా పోలీసులు గుర్తించారు. రెండు రోజుల క్రితం అనారోగ్యకారణాలతో అజీమొద్దీన్ నదిలో దూకాడు. దూకిన చోటే అజీమొద్దీన్ మృతదేహం తేలింది. శివాజీనగర్‌కు చెందిన రాకేష్ మానసిక స్థితి సరిగ్గాలేదని, ఈనెల 19న ఇంటి నుండి వెళ్లిన రాకేష్ ఇంటికి తిరిగి రాలేదు.

మైనింగ్ అండ్ జియాలజీ డైరెక్టర్‌ను కలసిన బ్రాహ్మణ సంఘం నేతలు

రామగిరి, జనవరి 25: రాష్ట్ర మైనింగ్ అండ్ జియాలజీ డైరెక్టర్‌గా నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన సుశీల్‌కుమార్‌ను గురువారం ఆయన ఛాంబర్‌లో రాష్ట్ర బ్రాహ్మణ ఆఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ జనరల్ సెక్రటరీ సుధాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేదాంతం పవన్‌కుమార్, నాయకులు ఆదిత్య, నీలకంఠం కైలాష్‌లు పుష్పంగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



డైరెక్టర్‌ను అభినందిస్తున్న బ్రాహ్మణ సంఘం నాయకులు

డివైడర్‌ను ఢీకొన్న బైక్ : ఇద్దరికీ గాయాలు

ఎల్లారెడ్డిపేట, జనవరి 25: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని పాత బస్టాండు ప్రాంతంలో గురువారం బైక్ డివైడర్‌ను ఢీకొట్టిన సంఘటనలో మండల కేంద్రానికి చెందిన బక్కి నితిన్, ఎర్రుల బన్నీ తీవ్ర గాయాల పాలయ్యారు. క్షతగాత్రులను మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వారిలో బన్ని పరిస్థితి విషమంగా మారడంతో కరీంనగర్‌కు తీసుకెళ్లారు.

రోడ్డు ప్రమాదంలో సింగరేణి కార్మికుడి మృతి

ఫైటింక్లయిన్‌కాలనీ, జనవరి 25: పోతనకాలనీ సమీపంలో గురువారం జరిగిన ప్రమాదంలో అడ్రియాల లాంగ్‌వాల్ కార్మికుడు బండ శశికుమార్(31) మృతి చెందాడు. మొదటి షిఫ్టుకు హాజరైన శశికుమార్ వ్యక్తిగత పనులు పూర్తి చేసుకుని సాయంత్రం సమయంలో ద్విచక్ర వాహనంపై గోదావరిఖని ఇంటికి బయలుదేరాడు. ఈ క్రమంలో లక్ష్మీపురం క్రాస్‌రోడ్డు వద్ద ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించబోయి అదుపుతప్పి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభానికి ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

సిరిసిల్ల క్రైమ్, జనవరి 25: సిరిసిల్ల పట్టణంలోని రగుడు బైపాస్ రోడ్డు వద్ద రెండు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వెలగొండ అభిలాష్ (20) అనే యువకుడు గురువారం రాత్రి హైదరాబాదులోని గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పెద్దూరుకు చెందిన అభిలాష్ ద్విచక్ర వాహనంపై సిరిసిల్ల బైపాస్ రోడ్డు నుంచి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న వాహనాన్ని ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

ఎల్లారెడ్డిపేట, జనవరి 25: ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్ గ్రామానికి చెందిన మహిళ నేరేళ్ల రాజవ్వ అదృశ్యంపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రమాకాంత్ గురువారం తెలిపారు. గ్రామంలోని రాజవ్వ అనారోగ్యంతో పాటు గత కొంత కాలంగా మతిస్థిమితం సరిగా లేదని పేర్కొన్నారు. ఈ నెల 2న ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగి రాలేదని చెప్పారు. బంధువులు, చుట్టు పక్కల గాలించినా ఆచూకీ లభించలేదని పేర్కొన్నారు.

రాజవ్వ కొడుకు జీవన్ ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ రమాకాంత్ వివరించారు.

రాజన్న ఆలయ అభివృద్ధిపై త్వరలోనే సమీక్ష

● సర్పంచ్ ఎన్నికలపై త్వరలోనే నిర్ణయం ● రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

వేములవాడ, జనవరి 25 : రాష్ట్రంలోనే అతి పెద్ద శైవ క్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం అభివృద్ధిపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో త్వరలోనే సమీక్ష సమావేశం నిర్వహిస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) అన్నారు. గురువారం ఆమె కుటుంబ సభ్యులతో కలిసి వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ అతిథిగృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయం అభివృద్ధి జరగాల్సినంత జరగలేదని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో త్వరలోనే ఆలయ అభివృద్ధిపై సమీక్ష సమావేశం ఏర్పాటు చేస్తామని అన్నారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం, మేడారం సమ్మక్క సారక్క జాతర వంటివి మన పూర్వీకులు మనకు వారసత్వంగా ఇచ్చినటువంటివని ఇలాంటి ఆధ్యాత్మిక కేంద్రాలను అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. మన ఆలయాలు, సంస్కృతి దేశం మొత్తం తెలిసేలా విస్తృత ప్రచారం చేయడంతో పాటు పెద్ద సంఖ్యలో వచ్చే భక్తులు మెచ్చేలా ఏర్పాట్లు చేస్తామని పేర్కొన్నారు. రాజన్న ఆలయం అభివృద్ధిలో తాము కూడా భాగస్వామ్యం అవుతామని చెప్పారు. రాష్ట్రంలో గ్రామపంచాయతీలకు ఇప్పటికిప్పుడు ఎన్నికలు నిర్వహించే పరిస్థితి లేదని, సర్పంచ్ ఎన్నికలకు సంబంధించిన అంశంపై రెండు రోజుల్లో ప్రభుత్వ పరంగా నిర్ణయం తీసుకుంటామన్నారు. స్టేట్ ఫైనాన్స్ నిధులు ఇతర పనులకు వెచ్చించడం వల్లే సర్పంచ్‌ల బిల్లులు పెద్ద మొత్తంలో పెండింగ్‌లో ఉన్నాయని మంత్రి తెలిపారు. నిధుల లభ్యత బట్టి సర్పంచుల పెండింగ్ బకాయిలను దశలవారీగా చెల్లించనున్నట్లు ఆమె తెలిపారు. ప్రతి పైసా ప్రజా సంక్షేమం కోసమే వెచ్చిస్తున్నామని స్పష్టం చేశారు.

విధ్వంస రాజకీయాలకు పాల్పడుతున్న కేటీఆర్

మాజీ మంత్రి కేటీఆర్ అధికారంలో లేకుండా ఒక్కరోజు కూడా ఉండలేకపోతున్నారని, అందుకోసమే కేటీఆర్ విధ్వంస రాజకీయాలకు పాల్పడుతున్నారని మంత్రి సీతక్క మండిపడ్డారు. గత పదేళ్లలో సామాజిక మాధ్యమాలలో ఉన్నది లేనట్టుగా చూపి కాలం గడిపారని, విదేశాలకు వెళ్లి నాలుగు ఇంగ్లీషు ముక్కలు నేర్చుకొని వచ్చి ఇదే భాషగా చూపి నటించారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలకు వస్తున్న ప్రజా ఆదరణను చూసి ఓర్వలేక కేటీఆర్ ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారని అన్నారు. తప్పుడు మాటలను ప్రజలు ఇకపై ఎట్టి పరిస్థితులలోనూ నమ్మలేని పరిస్థితి వచ్చిందని, ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన కేసీఆర్ ఇప్పటికీ ప్రమాణస్వీకారం చేయలేదని అన్నారు. కేటీఆర్ బుద్ధిగా ప్రతిపక్ష హోదాలో పనిచేస్తేనే ప్రజలు గుర్తిస్తారని లేదంటే ప్రజలు ఎప్పటికీ తిరస్కరిస్తూనే ఉంటారన్నారు. ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి వారిని కోరుకున్నాని తెలిపారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో తనది అన్న చెల్లెల్ల అనుబంధం అని, శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆశీస్సులతో తను ప్రభుత్వ విప్‌గా, తాను మంత్రిగా సేవలు అందిస్తున్నామని సీతక్క అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, స్థానిక కాంగ్రెస్ నాయకులు ఈ సందర్భంగా ఆమె వెంట ఉన్నారు.



వేములవాడలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క


రాజన్న సేవలో మంత్రి సీతక్క

వేములవాడ: రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి సేవలో తరించారు. మేడారం సమ్మక్క సారక్క జాతరకు వెళ్లడానికి ముందు రాజన్నను దర్శించుకునే ఆనవాయితీలో భాగంగా గురువారం ఉదయం ఆమె కుటుంబ సభ్యులతో కలిసి శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్కకు తొలుత ఆలయ అర్చకులు అధికారులు సంప్రదాయ బద్ధంగా పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆమె శ్రీ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ నేతృత్వంలో అర్చకులు, వేద పండితులు మంత్రికి వేదోక్త ఆశీర్వచనం గావించారు. రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శ్రీ స్వామివారి శేష వస్త్రంతో సత్కరించగా, ఆలయ ఈవో డి కృష్ణ ప్రసాద్ శ్రీ స్వామివారి చిత్రపటం అందజేశారు. అంతకుముందు శ్రీ రాజరాజేశ్వర స్వామివారి దర్శనం కోసం వచ్చిన మంత్రి సీతక్కను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఇతర అధికారులు మర్యాద పూర్వకంగా కలిశారు.

కార్యకర్తలపై అక్రమ కేసులు పెడితే ఊరుకోం

● ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

జగిత్యాల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తే సహించేది లేదని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. గురువారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని సబ్ జైలులో ఓ కేసులో అరెస్టు అయి ఉన్న బీఆర్‌ఎస్ నాయకుడు, హబ్సీపూర్ సర్పంచ్ రాజేశ్వర్‌రెడ్డిని కవిత పరామర్శించారు. అనంతరం జగిత్యాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కవిత మాట్లాడారు. రాష్ట్రంలో అధికార మార్పిడి జరగగానే బీఆర్‌ఎస్ నేతలపై కాంగ్రెస్ సర్కారు అక్రమంగా కేసులు నమోదు చేయిస్తూ కక్ష పూరిత రాజకీయాలను చేస్తోందన్నారు. హబ్సీపూర్ సర్పంచ్ రాజేశ్వర్ రెడ్డిని సంబంధం లేని కేసులో ఇరికించి అరెస్టు చేసి జైలుకు పంపడం దారుణమన్నారు. ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి కక్షపూరిత వైఖరిని అవలంభిస్తున్నారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ సర్కారు హయాంలో ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానంతో ప్రజలను పువ్వుల్లో పెట్టుకొని చూసుకున్నామని వివరించారు. ఏ పార్టీ కార్యకర్తలపై అయినా తాము రాజకీయంగా పోరాటం చేశామే తప్ప చట్టాన్ని, పోలీసులను వినియోగించుకొని కక్షపూరితంగా వ్యవహరించలేదన్నారు. అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజల కోసం పనిచేస్తూ హామీల అమలుకు ప్రయత్నం చేయాలని సూచించారు. విశ్వవిద్యాలయంలో శాంతియుతంగా ధర్నా చేస్తున్న విద్యార్థినిలను మహిళా పోలీసులు జుట్టు పట్టి లాగి పడగొట్టారని



జగిత్యాలలో జైలులో బీఆర్‌ఎస్ కార్యకర్తను పరామర్శించి వస్తున్న కవిత

ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, జగిత్యాల, కోరుట్ల ఎమ్మెల్యేలు డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్, డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు గట్టు సతీష్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు డాక్టర్ గొల్లపల్లి చంద్రశేఖర్ గౌడ్, పలువురు న్యాయవాదులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీలో ఫొటోగ్రాఫర్ ఆత్మహత్య

జ్యోతినగర్, జనవరి 25: ఎన్టీపీసీ కృష్ణానగర్‌కు చెందిన రమేష్(36) అనే ఔట్‌డోర్ ఫొటోగ్రాఫర్ బుధవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. 10 సంవత్సరాల క్రితం పెళ్లి చేసుకున్న రమేష్ రెండేళ్ల క్రితం విడాకులు తీసుకున్నాడు. అప్పటి నుంచి మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెదిన రమేష్ ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. సంఘటన స్థలాన్ని ఎన్టీపీసీ ఎస్‌ఐ జీవన్ పరిశీలించారు. మతుడి తల్లి సరోజన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ జీవన్ తెలిపారు.

ముస్లింల విద్యా ప్రమాణాల మెరుగుకు ఎంఐఎం కృషి

కరీంనగర్ టౌన్, జనవరి 25: ముస్లింల విద్యాప్రమాణాలు మెరుగుకు ఎంఐఎం కృషిచేస్తుందని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. సాలారే మిల్లత్ ఆల్‌ఇన్‌వన్ గైడ్స్ పంపిణీ కార్యక్రమం నగరంలోని ఎంఐఎం పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ కృషితోనే మైనారిటీ గురుకులాల అంకురార్పన జరిగిందన్నారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ ఉర్దూ మీడియం పాఠశాలల్లో పదవతరగతి చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా 2,024 గైడ్స్ అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్, జిహెచ్‌ఎంసి నానల్‌నగర్ కార్పొరేటర్ నసీరుద్దీన్, జమాతే ఇస్లామి హింద్ రాష్ట్ర నాయకుడు మహ్మద్ ఖైరుద్దీన్, సదర్ ఖాజీ మొఖయ్యర్ షాఖాన్, మైలానా అబుల్ కలాం మిస్బాహి, ముఫ్తి యూసుఫ్, మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమి, నగర ప్రధానకార్యదర్శి బర్కత్ అలీ, హఫీజ్ మొయిజుద్దీన్ ఖాద్రీ యూసుఫ్, ఖమరుద్దీన్ తదితరులున్నారు.

'తన భర్త చావుకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలి'

ఎల్లారెడ్డిపేట, జనవరి 25: తమకు రావాల్సిన భూమిని పట్టా చేయించకుండా ఇబ్బందులకు గురి చేయడంతో మనస్థాపం చెంది పురుగుల మందు తాగి వారం రోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తన భర్త మరణించాడని దీనికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని ఎల్లారెడ్డిపేట మండలం గుండారం గ్రామానికి చెందిన బానోతు జ్యోతి గురువారం ఆవేదన వ్యక్తం చేసింది. ఆమె కథనం మేరకు... గ్రామంలోని జ్యోతి ఆమె భర్త నాజం కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. నాజం గ్రామ శివారులో 2.02 ఎకరాల భూమిని 12 ఏళ్ల కిందట కొనుగోలు చేశాడు. నాజం, గణేశ్‌లు అన్నదమ్ములు. కొనుగోలు చేసిన భూమిలో ఇద్దరు పంచుకోగా చేరో ఎకరం భూమి వచ్చింది. తన మరిది గణేశ్ పట్టా చేయిస్తానని నమ్మించి భూమి మొత్తం ఆయన పేరిట మార్చుకున్నట్లు తెలిపింది. మూడేళ్లుగా పేరుపై భూమి చేయకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేశాడని తెలిపింది. పలుమార్లు పంచాయతీ నిర్వహించిన పెద్దలు అర ఎకరం పట్టా చేయడంతో పాటు రైతు బంధు కింద వచ్చిన రూ.20 వేలు నాజంకు చెల్లించాలని చెప్పారని తెలిపారు. అందుకు అంగీకరించిన గణేశ్ పట్టించుకోలేదని తెలిపింది. నాజం ఆరు నెలల కిందట ఉపాధి నిమిత్తం దుబాయి దేశానికి వలస వెళ్లి 15 రోజుల కిందట స్వగ్రామానికి తిరిగి వచ్చాడు. గణేశ్ తనకు భూమి చేయకపోవడంపై తన భర్త నాజం మనస్థాపం చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసినట్లు జ్యోతి తెలిపింది. వారం రోజులుగా సిరిసిల్ల ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 24న మృతిచెందినట్లు తెలిపింది. తన భర్త చావుకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొంది. లేని పక్షంలో తమ కుటుంబంతో కలిసి ఆందోళనకు దిగుతామని హెచ్చరించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రమాకాంత్ తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలి



మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల రూరల్, జనవరి 25 : రోడ్డు ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని డీఆర్ఎస్సీ చైర్మన్, కలెక్టర్ అనురాగ్‌జయంతి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం ఎస్పీ అఖిల్ మహాజన్‌తోపాటు వివిధ శాఖ అధికారులతో రోడ్డు భద్రతా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందరభంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నుంచి వాహనదారులను కాపాడడమే ప్రధాన లక్ష్యమన్నారు. రోడ్డు భద్రతా చర్యల్లో భాగంగా జిల్లాలోని ప్రధాన రోడ్డు మార్గాల్లో వాహనాల వేగాన్ని నియంత్రించే స్పీడ్ బ్రేకర్‌లు, స్త్రీప్‌ఎంత వేగంతో వెళ్లాలో సూచించే బోర్డులను ఏర్పాటు చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. వీటిపై రెండు వారాల్లో నివేదికలను అందించాలని సూచించారు. ప్రమాదాలు జరుగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడం చాలాముఖ్యమని స్పష్టం చేశారు. సైన్స్ బోర్డులు, వేగాన్ని సూచించే బోర్డులను ఏర్పాటు చేసేందుకు ఎవరైనా దాతలు ఉంటే సంప్రదించాలని అర్‌అండ్‌బీ అధికారులు సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్‌లకు సూచించారు. ప్రస్తుత జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా సీపీఆర్‌పై జిల్లాలోని గ్రామాల్లో ఏఎన్ఎంలు, అశా కార్యకర్తలు, టీచర్స్ , పంచాయతీ కార్యదర్శులు అవగాహన సదస్సులను నిర్వహించాలని కోరారు. సదస్సల నిర్వహణకు ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. రోడ్డు భద్రత చర్యల పర్యవేక్షణకు జిల్లా రవాణా అధికారి కొండల్‌రావు అధ్వర్యంలో ఒకకమిటీని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా మరణాలు సంభవిస్తున్నాయన్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలు జరిగిన స్థలానికి అర్ అండ్ బీ, పంచాయతీరాజ్, రవాణా, పోలీస్ శాఖల అధికారులు వెళ్లి ప్రమాదం ఎందుకు జరిగిందో పరిశీలించాలన్నారు. మళ్లీ జరగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో ప్రమాదకర స్థలాల్లో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లా రవాణా శాఖ అధ్వర్యంలో వాహనాదారులకు లైసెన్స్‌లు ఇప్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. జిల్లా అద నపు కలెక్టర్ పూజారి గౌతమి, డీపీవో రవీందర్, ఆర్‌అండ్‌బీ ఈఈ శ్యాంసుందర్, పంచాయతీ రాజ్ ఈఈ సూర్యప్రకాష్, ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ పంచాక్షరి, జిల్లా ప్లానింగ్ అధికారి అన్సారీ, సెస్ ఎండీ సూర్యచంద్రరావు, మున్సిపల్ కమిషనర్ అయాజ్, అన్వేష్, వేములవాడ దేవస్థానం ఈవో కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం

ఎల్లారెడ్డిపేట, జనవరి 25: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో జాతీయ ఓటరు దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. తహసీల్, ప్రభుత్వ, పాఠశాలలు, కళాశాలల్లో అధికారులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులు ఓటరు ప్రతిజ్ఞ చేశారు. తిమ్మాపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మాక్ పోలింగ్ చేపట్టారు. మండల కేంద్రంలో తహసీల్దార్ రాంచందర్ మాట్లాడుతూ ఓటరు నిర్ణయంపైనే దేశ భవిష్యత్ ఆధార పడి ఉంటుందన్నారు. నాయబ్ తహసీల్దార్ జయంత్‌కుమార్ పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: జాతీయ ఓటరుదినోత్సవం సందర్భంగా మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ 1950 జనవరి 25న భారత ఎన్నికల సంఘం ఏర్పాటయ్యిందని, ప్రతీ సంవత్సరం జాతీయ ఓటరు దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కుమారస్వామి, ఉపన్యాసకులు మల్లారెడ్డి, యాదగిరి, జీవన్‌బాబు, శంకరయ్య, కిషోర్, లక్ష్మన్, లింగమూర్తి, కిరణ్, రాజు, ప్రభాకర్ పాల్గొన్నారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండల కేంద్రంతో పాటు పలు ఆగ్రామాల్లో జాతీయ ఓటరు దినోత్సవం సంధర్భంగా ప్రతిజ్ఞ చేశారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ ఆఫీస్‌తో పాటు కొత్తపల్లి గ్రామ పంచాయితీ వద్ద జాతీయ ఓటరు దినోత్సవ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వంగ కరుణ, తహసీల్దార్ భూపతి, పంచాయితీ కార్యదర్శులు, నాయకులు ఉన్నారు.

వేములవాడ టౌన్: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ప్రజాయుధంతో సమానమని పాలిటెక్నిక్ కళాశాల, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌లు డాక్టర్ రాజగోపాల్, డాక్టర్ వడ్లూరి శ్రీనివాస్ అన్నారు. వేములవాడ మండలంలోని అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని వేరు వేరుగా నిర్వహించారు.

చందుర్తి: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. చందుర్తి మండల కేంద్రంలో జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి, బస్టాండ్ వద్ద ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఓటు హక్కు ప్రజాస్వామ్య వ్యవస్థకు ఆయువుపట్టు అన్నారు. సర్పంచ్ ప్రేమలత శ్రీనివాస్, సింగిల్ విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కోనరావుపేట: కోనరావుపేట మండలంలో జాతీయ ఓటర్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ విజయప్రకాష్‌రావు, సీనియర్ సిటిజన్‌ను సన్మానించారు. ఎంపీపీ చంద్రయ్య గౌడ్, సర్పంచ్ రేఖ, ఎంపీటీసీ చారి, ఎంపీడీవో రామకృష్ణ, డీటీ సత్యనారాయణ పాల్గొన్నారు.

రుద్రంగి: పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతీ ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ శ్రీలత అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా రుద్రంగి మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు.

● రుద్రంగి మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో గురువారం జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరస్పాడెంట్ ఏలిగేటి నరేష్, డైరెక్టర్‌లు తిపిరెడ్డి వెంకటరెడ్డి, ఎర్రం గంగనర్సయ్య, పడాల సురేష్, ప్రిన్సిపాల్ హరినాథ్ రాజు తదితరులు పాల్గొన్నారు.



సిరిసిల్లలో ఓటరు దినోత్సవ ర్యాలీ



ప్రతిజ్ఞ చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు



ఇల్లంతకుంటలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



సిరిసిల్లలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, సిబ్బంది



కొత్తపల్లిలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీపీ వంగ కరుణ



రుద్రంగిలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు

విద్యార్థినికి ప్రశంస పత్రం



ప్రశంసపత్రాన్ని అందుకుంటున్న విద్యార్థిని వైశాలి

ఎల్లారెడ్డిపేట, జనవరి 25: జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి కవితా పోటీల్లో ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని గొల్లపల్లి వైశాలి అత్యంత ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానంలో నిలిచింది. గురువారం హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూలో జరిగిన వేడుకల్లో గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ చేతుల మీదుగా ప్రశంస పత్రం అందుకుంది. ఈ సందర్భంగా హెచ్ఎం వెంకటరెడ్డి, సర్పంచ్ వాణి, ఎంపీటీసీ పద్మ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

దత్తాత్రేయ స్వామి గుట్టకు వంతెన నిర్మించాలి

బోయినపల్లి, జనవరి 25: బోయినపల్లి మండలంలోని వర్దవెల్లి దత్తాత్రేయ స్వామి గుట్టపైకి వెళ్లేందుకు బ్రిడ్జి నిర్మించాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కూస రవీందర్ గురువారం వినతి పత్రం అందజేశారు. దత్తాత్రేయ స్వామి గుట్ట చుట్టూ మిడ్ మానేరు జలాశయం నీరు విస్తరించడంతో నిత్య పూజలకు ఆటంకం ఏర్పడుతోంది. ఏటా ఆలయంలో దత్తాత్రేయ స్వామి జయంతి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తారు. అయితే గుట్ట చుట్టూ నీరు ఉండడంతో ఆలయ కమిటీ విజ్ఞప్తి మేరకు టూరిజం శాఖ వారు బోట్లను సమకూరుస్తూ వస్తున్నారని మంత్రి వివరించారు. ఈ మేరకు మంత్రి స్పందించి, అంచనాలను రూపొందించాలని ఇరిగేషన్ ఎస్ఈని ఆదేశించారు.

విద్యార్థులకు టీ షర్ట్‌ల పంపిణీ

ఇల్లంతకుంట, జనవరి 25: మండలంలోని దాచారం గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సామల సుభాష్ టీషర్టులను గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పర్శరాం, ఎంపీటీసీ బర్ల తిరుపతి, ఉపసర్పంచ్ సుమతికాంతరెడ్డి, , ప్రధానోపాధ్యాయిని రాణి, నాయకులు వాడె సంజీవరెడ్డి, మారవేని రమేష్ పాల్గొన్నారు.

ముగిసిన సీనియర్ సిటిజన్స్ క్రీడలు

సిరిసిల్ల టౌన్, జనవరి 25 : తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు కొనసాగిన వివిధ క్రీడలు గురువారం ముగిసాయి. రెండో రోజు జిల్లా కేంద్రంలోని టౌన్‌క్లబ్‌లోని ఇండోర్ స్టేడియంలో సీనియర్ జాతీయ మాస్టర్స్ అథ్లెట్ రామానుజమ్మ పర్యవేక్షణలో సీనియర్ సిటిజన్స్‌కు క్యారం, చందరంగం, నవ్వులాట పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి జనపాల శంకరయ్య మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్ ఐక్యతతో ముందుకు సాగాలన్నారు. విజేతలకు గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం బహుమతులు ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఏనుగుల ఎల్లయ్య, సభ్యులు తడక శ్రీహరి, సిరిసిల్ల రాజేశ్వరి, గుడ్ల శ్రీధర్, జ్ఞానాభ, వడ్డెపల్లి రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

వలస కూలీలతో ఉపాధి కోల్పోతున్న స్థానికులు

ఇల్లంతకుంట, జనవరి 25: వలస కూలీలతో స్థానిక కూలీలు ఉపాధి కోల్పోతున్నారని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు అన్నారు. మండలంలోని పొత్తూర్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. 55 సంవత్సరాలు నిండిన కార్మికుడికి నెలకు రూ.5వేల పెన్షన్ ఇవ్వాలన్నారు. ప్రమాదబీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను ఎత్తి వేసి, నిత్యావసర వస్తువుల ధరలను పెంచిందన్నారు. సమావేశంలో హమాలీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు భూంపెల్లి భూంరెడ్డి, అశీల మల్లేశం, దామెర దేవయ్య, దేవరాములు, యాదయ్య, మొండయ్య, శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.

బావనారుషి సమాజ సేవా సంఘం కార్యవర్గం

వేములవాడ, జనవరి 25 : వేములవాడ పట్టణంలోని మార్కండేయ నగర్ కాలనీ బావనారుషి సమాజ సేవా సంఘం నూతన కార్యవర్గం ఎన్నికలు గురువారం నిర్వహించారు. ఏకగ్రీవంగా జరిగిన ఈ ఎన్నికలలో అధ్యక్షుడిగా కొక్కుల అంజయ్య ఉపాధ్యక్షులుగా మేర్గు గంగరాజం, గడ్డం రవి, ప్రధాన కార్యదర్శిగా అల్లె నరేష్, సంయుక్త కార్యదర్శిగా మద్దిరాల సుమన్, సహాయ కార్యదర్శిగా అడ్డగట్ల అశోక్, కోశాధికారిగా మాదాసు దేవదాసు, డైరెక్టర్లుగా ఆడెపు మల్లేశం, నాగుల ప్రవీణ్, దూస విజయ్, కళ్యాడపు వెంకటుమల్లు, బొడ్డు శంకరయ్య, పడాల గంగారం, భోగ మనోహర్, బూర్ల శ్రీధర్, బైరి శేషాద్రి, కోడం దేవయ్య ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి చిప్ప యాదగిరి తెలిపారు.

పోగొట్టుకున్న మొబైల్‌ఫోన్ అప్పగింత

ఇల్లంతకుంట, జనవరి 25: మండల కేంద్రానికి చెందిన గొర్రె రాము పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను గురువారం అప్పగించినట్లు ఎస్సై దాస సుధాకర్ తెలిపారు. రాము నెల రోజుల కిందట రూ.18వేల విలువైన ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఈఈఆర్ అప్లికేషన్ సహకారంతో గుర్తించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

సెకండ్ అడిషనల్ జూనియర్ సివిల్ కోర్టు మంజూరు



సెకండ్ అడిషనల్ కోర్టు ఏర్పాటు కానున్న భవనం

సిరిసిల్ల క్రైం, జనవరి 25: జిల్లా కోర్టు పరిధిలో మరో సెకండ్ అడిషనల్ జూనియర్ సివిల్ కోర్టు మంజూరు చేస్తూ హైకోర్టు రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీచేశారు. జిల్లా కోర్టు భవనసముదాయంలో శనివారం ఉదయం 10.30గంటలకు ప్రారంభించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో సిరిసిల్లలో మూడు జూనియర్ సివిల్ కోర్టులకు చేరనున్నాయి. ఈ సెకండ్ అడిషనల్ జూనియర్ సివిల్ కోర్టును జిల్లా అడ్మినిస్ట్రేషన్ జడ్జి, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మాధవి దేవి ప్రారంభించనున్నారు. ప్రత్యేక అతిధిగా రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జె. శ్రీనివాసరావు హాజరుకానున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్. ప్రేమలత పేర్కొన్నారు.

పోలీస్‌స్టేషన్‌ల కేటాయింపు

సిరిసిల్లలో మూడు జూనియర్ సివిల్ కోర్టులకు సంబంధించిన కేసుల పరిష్కారానికి ఆయా పోలీస్‌స్టేషన్‌ల పరిధిని కేటాయిస్తూ గురువారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్. ప్రేమలత ప్రకటించారు. ఇందులో భాగంగా సిరిసిల్ల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టుకు సిరిసిల్ల టౌన్, ముస్తాబాద్ పోలీస్‌స్టేషన్‌తోపాటు సిరిసిల్ల ఎక్సైజ్ స్టేషన్‌ను కేటాయించారు. సిరిసిల్ల ఒకటవ అడిషనల్ జూనియర్ సివిల్ కోర్టు పరిధిలోకి ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, వీర్నపల్లి పోలీస్‌స్టేషన్‌తోపాటు జూవైనల్ కేసులను తీసుకొచ్చారు. సిరిసిల్ల రెండో అడిషనల్ జూనియర్ సివిల్ కోర్టు పరిధిలోకి తంగళ్లపల్లి, కోనరావుపేట, ఇల్లంతకుంట పోలీస్‌స్టేషన్‌తోపాటు ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ స్టేషన్‌లను కేటాయిస్తూ జిల్లా జడ్జి ఉత్తర్వులు జారీచేశారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ఎల్లారెడ్డిపేట, జనవరి 25: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ మీసం లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని మండల వనరుల కేంద్రం కార్యాలయం ఎదుట ఫిబ్రవరి 4న సిరిసిల్లలో నిర్వహించ తలపెట్టిన కార్మికుల సదస్సుకు సంబంధించిన కర పత్రాలను నిర్వాహకులతో కలిసి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నిర్వహణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులను కేటాయించాలన్నారు. బిల్లులు రాక అప్పులు చేయాల్సిన దుస్థితి దాపురిస్తోందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సరుకులను అందిస్తున్న విధానంలో పాఠశాలలకు సరఫరా చేయాలన్నారు. ప్రభుత్వం సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేని పక్షంలో సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. సిరిసిల్లలో నిర్వహించే సదస్సుకు రాష్ట్ర అధ్యక్షుడు ప్రేంపావని, ప్రధాన కార్యదర్శి రవీందర్ ముఖ్య అతిథులుగా హాజరవుతారని పేర్కొన్నారు. మండలంలోని మధ్యాహ్న భోజన కార్మికులు అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన నిర్వాహకులు మణమ్మ, సత్తవ్వ, బాలలక్ష్మీ, రేణుక, జ్యోతి, మల్లవ్వ, నర్సవ్వ, లక్ష్మీ, మరియా తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మధ్యాహ్న భోజన నిర్వాహకులు

మల్లన్నసాగర్ నీటితో మునిగిపోతున్న భూములు



కలెక్టరేట్‌కు తరలివచ్చిన చీకోడు గ్రామస్థులు

సిరిసిల్ల కలెక్టరేట్, జనవరి 25 : మల్లన్నసాగర్ ప్రాజెక్టు నుంచి కాలువ ద్వారా నీటిని చీకోడు శివారులోని చింతల చెరువులోకి నింపడంతో 110 ఎకరాల్లో పంట భూములు మునిగిపోతున్నాయని, తమకు ఉపాధి లేకుండా పోతోందని గ్రామస్థులు పేర్కొన్నారు. ముస్తాబాద్ మండలం చీకోడుకు చెందిన చింతల చెరువు బాధితులు గురువారం కలెక్టరేట్‌కు తరలివచ్చి మల్లన్నసాగర్ నీటిని చింతల చెరువుకు తీసుకురావద్దంటూ ఆందోళనకు దిగారు. కలెక్టర్ అనురాగ్ జయంతికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ చీకోడు శివారులో చింతల చెరువు కింద 110 ఎరకాల పట్టా భూములు ఉన్నాయని, వాటిపై ఆధారపడి పంటలను సాగు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నామని తెలిపారు. ఆ భూములు పోతే ఉపాధి లేకుండాపోతుందన్నారు. గత ప్రభుత్వ చీకోడులోని చింతల చెరువులోకి మల్లన్నసాగర్ నుంచి నీటిని తీసుకొచ్చి నింపిందన్నారు. ఆ చెరువులోకి వచ్చిన నీటిని కిందకు పంపిస్తామని చెప్పి స్టోరేజ్ చేయడంతో పంటలు మునిగి నష్టపోతున్నామన్నారు. ప్రజాప్రతినిధులతోపాటు అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినా న్యాయం జరగలేదని, ఇప్పుడు మళ్లీ మల్లన్నసాగర్ నుంచి నీటిని తీసుకొచ్చేప్రయత్నాలు జరుగుతున్నాయని, నీరు రాకుండా నిలిపివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంపెల్లి శ్రీనివాస్, ఎల్లం, రమేష్ పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావాలు పెంపు

వేములవాడ టౌన్, జనవరి 25: క్రీడలతో స్నేహభావాలు పెంపొందుతాయని, గెలుపోటములను సమానంగా స్వీకరించాలని సర్పంచ్ జింక సునితవేణు అన్నారు. వేములవాడ మండలం సంకెపల్లిలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్‌ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవం సందర్భంగా గ్రామాల్లోని యువకుల కోసం క్రికెట్ టోర్నమెంట్‌ను ఏర్పాటు చేయాలని అనుకున్నామన్నారు. జింక శ్రీధర్, రెడ్డవేని పర్శరాములు, రెడ్డవేని రాజు, నాగుల ప్రశాంత్, యెల్లే సతీష్, మారవేని మహేష్, కాచం నిఖిల్, అరవింద్, నరేష్, మల్లేశం, రేకేష్, రాజుకుమార్ తదితరులు ఉన్నారు.

సీసీ కెమెరాలతో నేరాలు తగ్గుముఖం

ఇల్లంతకుంట, జనవరి 25: సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలు తగ్గుముఖం పడుతాయని ఎస్సై సుధాకర్ అన్నారు. మండలంలోని పెద్దలింగాపూర్‌లో గురువారం సర్పంచ్ గొడిశెల జితేందర్‌గౌడ్ సీసీ కెమెరాను గ్రామంలో ఏర్పాటు చేస్తుండగా ఎస్సై పరిశీలించారు. అన్ని గ్రామాలలో సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామస్థులు ముందుకు రావాలన్నారు.

హైదరాబాద్‌కు తరలిన కాంగ్రెస్ నాయకులు

గంభీరావుపేట, జనవరి 25: హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో జరిగిన బూత్ స్థాయి శిక్షణ తరగతులకు గంభీరావుపేట మండలం నుంచి కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. మండల అధ్యక్షుడు హమీద్, ఎంపీటీసీ పర్ధరాములు, నాయకులు సాయిరెడ్డి, గంగి స్వామి, శనగరంపు శంకర్, ఎడబోయిన ప్రబాకర్, రామచంద్రరెడ్డి, ఎలుక రాజు, సంతోష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

మంచి ఆహారం తీసుకుంటేనే ఆరోగ్యం

కోనరావుపేట, జనవరి 25: మంచి ఆహారం తీసుకున్నప్పుడే ఆరోగ్యంగా ఉంటామని కోరరావుపేట వైద్యాధికారి వేణుమాధవ్ అన్నారు. కోనరావుపేట కేంద్రంలోని మోడల్ స్కూల్లో ఎనీమియా ముక్త్ బారత్‌లో బాగంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ చాలామంది విద్యార్థుల్లో రక్తహీనత ఉందన్నారు.ప్రోటీన్స్‌తో కూడిన ఆహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటామన్నారు. ఆర్‌బీఎస్‌కె వైద్యాధికారి కృష్ణవేణి, ప్రిన్సిపాల్ సాగర్ ఉన్నారు.

గ్రామాభివృద్ధికి సహకరించాలి

కోనరావుపేట, జనవరి 25: మర్తనపేట గ్రామ అభివృద్ధికి ప్రతీ ఒక్కరు సహకరించాలని మర్తనపేట సర్పంచ్ వంశీరావు అన్నారు. గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గ్రామ మాజీ సర్పంచ్ తిరుపతిగౌడ్ తనపై చేసిన ఆరోపణలు సరికాదన్నారు. వ్యక్తిగత కారణాలను దృష్టిలో పెట్టుకొని ఆరోపణలు చేయడం సరి కాదన్నారు.

కేటీఆర్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నాయకుల ఆగ్రహం

ఎల్లారెడ్డిపేట, జనవరి 25: ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే కాంగ్రెస్ నాయకుల బట్టలు ఊడదీస్తామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ వ్యాఖ్యానించడంపై కాంగ్రెస్ నాయకుల ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో ప్రజలు ఎవరి బట్టలు విప్పారో తెలుసుకోవాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. హైదరాబాద్‌లో తలపెట్టిన కాంగ్రెస్ కార్యకర్తల రాష్ట్ర స్థాయి సమావేశాలకు ఎల్లారెడ్డిపేట మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ఆ పార్టీ నాయకులు గురువారం తరలి వెళ్లారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీ పథకాలను ప్రజకు అందుబాటులోకి తీసుకొస్తుందన్నారు. మాజీ మంత్రి కేటీఆర్ అధికారం కోల్పోయి మతి తప్పి మాట్లాడుతున్నారని ఆరోపించారు. కేసీఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రి చేయాలని కోరడం సిగ్గుచేటన్నారు. నాయకులు లక్ష్మారెడ్డి, గౌస్, లింగాగౌడ్, గిరిధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మల్లారెడ్డి, రాజయ్య, రాంరెడ్డి, బుచ్చాగౌడ్, బాబు పాల్గొన్నారు.

పొన్నం ప్రభాకర్‌ను కలిసిన కొండూరు గాంధీ

గంభీరావుపేట, జనవరి 25 : రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రబాకర్‌గౌడ్‌ను రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు కొండూరు గాంధీ గురువారం కలిశారు. హైదరాబాద్‌లోని పొన్నం నివాసంతో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సిరిసిల్ల నియోజక వర్గ స్థాయిలోని పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

ముగిసిన న్యాయవాదుల ఆటలపోటీలు



క్యారమ్ ఆడుతున్న జడ్జిలు ప్రేమలత, శ్రీలేఖ

సిరిసిల్ల క్రైం, జనవరి 25: ప్రతి నిత్యం కేసులతో కుస్తీపడే న్యాయవాదులు వారం రోజులుగా ఆటవిడుపిచ్చింది. గణతంత్రదినోత్సవం సందర్భంగా సిరిసిల్ల, వేములవాడ బార్ అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయవాదుల క్రీడలు గురువారం ముగిసాయి. న్యాయవాదులు వివిధ క్రీడల్లో పోటాపోటీగా తలపడ్డారు. ఈ క్రీడలను క్యారమ్ డబుల్స్‌లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్.ప్రేమలత, సీనియర్ సివిల్ జడ్జి శ్రీలేఖ షోమ్యాచ్ ఆడి ప్రారంభించారు. పురుషులతోపాటు మహిళా న్యాయవాదులు పాలుపంచుకున్నారు. సిరిసిల్ల న్యాయవాదుల క్రికెట్ పోటీల్లో నాలుగు జట్లు పాలుపంచుకోగా గోవర్ధన్, కోడి లక్ష్మణ్ జట్లు ఫైనల్‌లో తలపడగా టై కావడంతో సంయుక్తంగా విజేతలుగా నిలిచారు. క్యారమ్స్ డబుల్స్‌లో కీసరి శ్రీనివాస్, కుంట శ్రీనివాస్ టీమ్, కె.రాజేశ్, ఏ. చంద్రశేఖర్ టీమ్, క్యారమ్స్ సింగిల్స్‌లో పెంట శ్రీనివాస్, డి.సందీప్‌కుమార్, మహిళల క్యారమ్స్ సింగిల్స్‌లో జైశ్వర్య, యమున, బ్యాడ్మింటెన్ పురుషుల డబుల్స్‌లో బిట్ల విష్ణు అండ్ కీసరి శ్రీనివాస్, ఏ శేఖర్ అండ్ బి.శ్రీనివాస్, బ్యాట్‌మెంటెన్ పురుషుల సింగిల్స్‌లో శేఖర్, కీసరి శ్రీనివాస్ ప్రథమ, ద్వితీయ విజేతలయ్యారు. మహిళల క్యారమ్స్ డబుల్స్‌లో విన్నర్‌గా నిషాద్, అండ్ జైశ్వర్య, రన్నర్‌గా కళ్యాణీ, అనీలాలు నిలిచారు. మహిళల బ్యాట్‌మెంటెన్ సింగిల్స్‌లో సుష్మా, జైశ్వర్య ప్రథమ, ద్వితీయ విజేతలుగా నిలిచారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం జెండా ఆవిష్కరణ అనంతరం జిల్లా పధాన న్యాయమూర్తి ఎన్. ప్రేమలత చేతులమీదుగా విజేతలకు బహుమతులు అందజేస్తారని క్రీడల కార్యదర్శి గుడ్ల కిషన్ తెలిపారు.

వేములవాడలోనూ న్యాయవాదుల క్రీడలు

వేములవాడ కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు క్రీడలు నిర్వహించారు. ఈ క్రీడల్లో బాగంగా స్కిల్ గేమ్‌లో విన్నర్‌గా తిరుమలగౌడ్, రన్నర్‌గా సత్యనారాయణ, చెస్‌లో విన్నర్ గోస్కుల ప్రభాకర్, రన్నర్‌గా కట్కుం జనార్ధన్‌లు, క్యారం సింగిల్స్‌లో విన్నర్‌గా సుజీవన్, రన్నర్‌గా పురంశెట్టి నాగరాజులు, క్యారమ్ డబుల్స్‌లో విన్నర్‌లుగా సుజీవన్, తిరుపతి, రన్నర్‌లుగా గడ్డం సత్యనారాయణరెడ్డి, పంపరి శంకర్‌లు, షటిల్ సింగిల్‌లో విన్నర్ గోస్కుల ప్రభాకర్, రన్నర్‌గా పురంశెట్టి నాగరాజు, షటిల్ డబుల్స్‌లో విన్నర్‌గా పంపరిశంకర్ అండ్ వేణు, రన్నర్‌గా గుజ్జ మనోహర్, జిల్లా జ్ఞానేశ్వర్ నిలిచారని క్రీడల కార్యదర్శి రేగుల రాజ్‌కుమార్ తెలిపారు.



క్యారమ్ డబుల్స్ ఫైనల్‌లో తలపడుతున్న న్యాయవాదులు